క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే శంబంగి నామినేషన్



ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు బొబ్బిలి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా శుక్రవారం నామినేషన్ వేయనున్నారు. ఉదయం 11 గంటలకు స్థానిక ఆర్‌డీవో కార్యాలయం చేరుకుని, రిటర్నింగ్ అధికారికి ఎమ్మెల్యే తన నామినేషన్ పత్రాలు, అఫిడవిట్‌ను దాఖలు చేస్తారు. నామినేషన్‌కు ముందు ఉదయం 8 గంటలకు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశమై, అక్కడి నుంచి పలు ఆలయాలను సందర్శించి, ఆ తర్వాత ర్యాలీగా వెళ్లి, నామినేషన్ వేస్తారు.

బాడంగి: ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు నామినేషన్ ర్యాలీని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొమ్మినాయుని వెంకటనాయుడు, మండల యూత్ అధ్యక్షుడు వంగపండు రమేష్, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు కోరారు. ఇదే విషయమై వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 8 గంటలకే గ్రామాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలంతా బయలుదేరి, బొబ్బిలిలోని దాడితల్లి ఆలయం వద్దకు చేరుకోవాలన్నారు.

మే 5, 6 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

రామభద్రపురం: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి, మే 5, 6వ తేదీల్లో బొబ్బిలిలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సులోచనరాణి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో గురువారం సమావేశమైన ఆమె పారదర్శకంగా ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు, సలహాలు చేశారు. సమావేశంలో ఎంఈవో తిరుమల ప్రసాద్, ఏవో వెంకటయ్య పాల్గొన్నారు.

పరామర్శ

సంతకవిటి: మండలంలోని తలతంపర గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో చిలకలపల్లి సూర్యనారాయణకు చెందిన 20 ధాన్యంబస్తాలు, ఐదెకరాల గడ్డివాము, వ్యవసాయ పైపులు, రాగోలు అనంతరావుకు చెందిన కరెంట్ మీటరు, పశువుల శాల, కండ్యాపు సత్యం..కు చెందిన రెండెకరాల గడ్డివాము దగ్ధమయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు ఆ గ్రామానికి గురువారం వెళ్లి, బాధిత రైతులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమాభివృద్ధి

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



బొబ్బిలి: గొల్లవీధిలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శంబంగికి ఘనస్వాగతం పలుకుతున్న ప్రజలు

బొబ్బిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక పట్టణంలోని గొల్లవీధి జంక్షన్‌లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యేకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించారు. రాబోయే రోజుల్లోనూ రాష్ట్రం, రాష్ట్రంలోని ప్రజలు మరింత బాగుండాలంటే వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. ఎన్నికల వేళ టీడీపీ కూటమి నేతలు చెప్పే మాయమాటలు నమ్మవద్దన్నారు. ప్రజల బాగోగుల కోసం నిరంతరం పరితపించే జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను, ఎంపీగా పోటీలో ఉన్న బెల్లాన చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి, జగనన్నకు కానుకగా ఇవ్వాలని అభ్యర్థించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైస్ చైర్మన్లు చెలికాని మురళీకృష్ణ, రమాదేవి, జేసీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ శంబంగి శ్రీకాంత్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని ఆశీర్వదించండి..

రాజాం: రానున్న ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, వైఎస్సార్ సీపీని ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాలని రాజాం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని బొమ్మినాయుడువలస, విజయరాంపురం, గెడ్డవలస, ముద్దాడజోగివలస, గాార్రాజుచీపురుపల్లి, గొల్లపేట, బూరాడపేట గ్రామాల్లో గురువారం పర్యటించిన ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. ఎన్నికలు వస్తున్నాయంటే మోసపూరిత హామీలతో ప్రజలను మోసగించేందుకు సిద్ధమైన టీడీపీ కూటమి నేతలను నమ్మవద్దన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి, అభివృద్ధి, సంక్షేమం చేసిన సీఎం జగనన్నకు అండగా నిలవాలన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను, ఎంపీగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, జేసీఎస్ కన్వీనర్ కె.శ్రీనివాసరావు, సర్పంచ్ వి.అన్నపూర్ణ, ఎంపీటీసీ డి.లక్షుంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



రాజాం: బొమ్మినాయుడువలసలో ఎన్నికల ప్రచారంలో రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

రైతుబిడ్డను గెలిపించుకుంటాం

బొబ్బిలి: రైతుబిడ్డ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడునే మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని కొప్పుల వెలమ సంఘ రాష్ట్ర, జిల్లా నాయకులు కె.సత్యనారాయణ, బి.సాయికృష్ణ, జి.కృష్ణమూర్తినాయుడు, ఎం.అప్పారావు, ఆర్.దామోదరరావు, బి.తిరుపతినాయుడు, ఎం.శ్రీహరినాయుడు, వి.శ్రీరాములునాయుడు, రమణయ్య, ఎస్.సింహాచలం అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగిని వారంతా గురువారం కలిసి, తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి గ్రామగ్రామాన పర్యటించి, గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు బొత్స కాశినాయుడు, బొమ్మి కాశినాయుడు, సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

బీసీల సత్తా చాటుదాం



మాట్లాడుతున్న పార్టీ మండల అధ్యక్షుడు లక్షుంనాయుడు తదితరులు

రామభద్రపురం: రైతుబిడ్డ, బీసీ నేత ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడును అత్యధిక మెజార్టీతో మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకుని, బీసీల సత్తా చాటుదామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్షుంనాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, మండల యూత్ అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏకనాథ్ పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో గురువారం మాట్లాడిన వారు.. గతంలో రాజులకు అధికారమిచ్చి, మోసపోయిన విషయాన్ని ఎవరూ మర్చిపోకూడదన్నారు. బొబ్బిలి రాజులను గెలిపిస్తే వారి ఇంటి గేటు ముందు చేతులు కట్టుకుని నిలబడాల్సిన దుస్థితి వస్తుందన్న విషయం ప్రతిఒక్కరూ గుర్తుపెట్టుకోవాలన్నారు. ఎన్నికల ముందు వారు ఇచ్చే డబ్బులకు ఆశపడితే మన గొయ్యి మనం తవ్వుకున్నట్లేనన్నారు.

టీడీపీ వారికే మళ్లీ కండువాలు వేసి ప్రచారం

రేగిడి: మండలంలోని బూరాడ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలకే మళ్లీ టీడీపీ కండువాలు వేసి, ఆ పార్టీ ప్రచారం చేసుకోవడం చాలా విడ్డూరంగా ఉందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు అన్నారు. ఇదే విషయమై వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ బూరాడ పంచాయతీలో వైఎస్సార్ సీపీ గతంలో కన్నా చాలా బలంగా ఉందని, 70 శాతం ఓటర్లు వైఎస్సార్ సీపీలోనే ఉన్నారని, ఈ పంచాయతీలో టీడీపీ తన ఉనికిని చాటుకునేందుకు చేసే ప్రయత్నంలో టీడీపీ వారికే టీడీపీ కండువాలు వేసి, టీడీపీలో వైఎస్సార్ సీపీ వారు చేరినట్లు తప్పుడు ప్రచారాలు చేసుకుంటున్నారని విమర్శించారు. గ్రామం నుంచి టీడీపీలో చేరిన వారు వైఎస్సార్ సీపీ వారు అని నిరూపిస్తే దేనికైనా సిద్ధమని సవాలు విసిరారు. ఎవరెన్ని కుతంత్రాలు చేసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమన్నారు.



మాట్లాడుతున్న జగన్మోహనరావు, అచ్చెన్నాయుడు

● ఫ్యాన్ గుర్తుకే ఓటేయండి



తెర్లాం: నందబలగ పంచాయతీ గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నేతల ప్రచారం



బొబ్బిలి: మండల కేంద్రంలో వైఎస్సార్ సీపీ మహిళా నేతల ఎన్నికల ప్రచారం

వైఎస్సార్ సీపీ నేతలు ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూ మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. గ్రామగ్రామాన ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ నేతలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండడం విశేషం. – సాక్షి నెట్‌వర్క్.



రేగిడి: తోకలవలసలో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ నేతలు



మెంటాడ: గుర్లలో ప్రచారం చేస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

బొబ్బిలి: మండలంలోని దిబ్బగుడ్డివలసకు చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శంబంగి వేణుగోపాలనాయుడు వారందరికీ పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కటికి లక్ష్మణరావు, ఈదుబిల్లి భాస్కరరావు, జి.ప్రసాద్, నగిరెడ్డి కొండలరావు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతల రామారావు తదితరులు పాల్గొన్నారు.

● వలంటీర్ల రాజీనామా



రామభద్రపురం: ఎంపీడీవో ఈశ్వరమ్మకు రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు



బాడంగి: తెంటువలసలో రాజీనామా పత్రాలతో వలంటీర్లు



తెర్లాం: చీకటిపేట పంచాయతీ కార్యదర్శికి రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు



సంతకవిటి: పంచాయతీ కార్యదర్శికి రాజీనామా పత్రాలు అందిస్తున్న మామిడిపల్లి వలంటీర్లు

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట గ్రామానికి చెందిన 18 మంది, బూసాయవలసకు చెందిన 12 మంది, కొట్టక్కి గ్రామానికి ఇద్దరు వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. మండలంలో మొత్తం 294 మంది వలంటీర్లు ఉండగా, ఇప్పటి వరకు 121 మంది రాజీనామా పత్రాలు అందజేసినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

బాడంగి: మండలంలోని తెంటువలస, గొల్లాది, డొంకినవలస, గజరాయునివలస, కోడూరు-2, రేజేరు గ్రామాలకు చెందిన వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు.

తెర్లాం: మండలంలోని చీకటిపేటకు చెందిన వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. రానున్న ఎన్నికల్లో తామంతా వైఎస్సార్ సీపీ గెలుపు కోసం కృషి చేస్తామని వారు తెలిపారు.

సంతకవిటి: మండలంలోని మామిడిపల్లి వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు.